# షాక్

ఒక చంకలో పిల్లాణ్ణెత్తుకుని, మరో చంకకి చేతి సంచీ తగిలించుకుని నడుస్తున్న వేణు "ఒరేయ్ నరేష్!" అని అరుస్తుంటే ఎవరబ్బా అని తిరిగి చూశాడు. ఆశ్చర్యం, ఆనందం ఒక్కసారిగా ముంచుకు రాగా "ఒరేయ్ నువ్వా?" అంటూ గబగబా నడిచాడు నరేష్- వాళ్ళ అరుపులు అందరూ వింటున్నారనిగానీ, అందరూ అటే చూస్తున్నారని గానీ అనుకోకుండా.

"ఒరేయ్! నువ్వు పెళ్ళి చేసుకున్నావా?" నరేష్ వేణుని అడిగిన మొదటి ప్రశ్న.

"వీడు మా సుపుత్రుడోయ్! నాన్నా టింకూ- అంకుల్‌కి నమస్కారం పెట్టు" అన్నాడు చంకలోని పిల్లాడ్ని చూపిస్తూ వేణు.

వాడు నోట్లో వేలేసుకుని "ఊఁ" అంటూ తల అడ్డంగా తిప్పేడు.

"సర్లే! ఏదీ మీ ఆవిడ?" అన్నాడు నరేష్, ఆవిడ్ని చూడాలన్న ఆత్రాన్ని మాటల్లోనే ప్రదర్శిస్తూ. అతనంత క్యూరియాసిటీతో అడగడం చూసి వాళ్లావిడ మొహం చిట్లించుకుంది.

"మా ఆవిడ ఇంటి దగ్గరుందిరా. పద మా ఇంటికి పోదాం" అన్నాడు వేణు.

"మరోసారొస్తాం" అంది నరేష్ భార్య సుమతి విసుక్కుంటూ.

"కాదు, ఇప్పుడే వెళ్దాం" అంటూ ఆమె సమాధానానికైనా ఎదురు చూడకుండా వెళుతున్న భర్తని చూస్తే వొళ్ళు మండింది ఆమెకి.

"మీక్కాదు మరోసారి వెళ్దాం అని చెబుతూంటే? అసలు మనం ఏం పని మీద బయల్దేరామో మర్చిపోయారా?" సణిగింది ఆమె. నరేష్ ఏదీ

వినిపించుకోవడం లేదు. గబ గబా నడిచి వెళ్ళి "ఎలా వుంటుందిరా మీ ఆవిడ?" అడిగాడు. సుమతికి ఒళ్ళు మండుకొచ్చింది.

"ఏమండీ, కూరల సంచీ బరువుగా వుంది. ఇంకా మనం జనరల్ బజారు కెళ్ళాలి. మరోసారి వెళ్ళొచ్చు పదండి" అంది.

"అహ... అలాకాదు నువ్వు రిక్షాలో ఇవన్నీ వేసుకుని ఇంటి కెళ్ళిపో. నేను వీడితో వెళ్ళొస్తాను" అంటూ ఆమె సమాధానం కోసం ఎదురుచూడకుండా వేణు వెంట నడిచి వెళ్ళిపోయాడు నరేష్.

సుమతికి కోపం, దుఃఖం ముంచుకొచ్చాయి. చేసేది లేక ఉస్సురంటు రిక్షా ఎక్కింది సుమతి.

వేణుకి అప్పటికి పందొమ్మిదోసారి పిల్లని చూట్టానికి వెళ్ళడం. వేణూ పెళ్ళి చూపులు అంటే అందరికీ వేళాకోళమైపోయింది చివరకి. ఏ పిల్లని చూడ్డానికెళ్ళినా తిరిగొచ్చాక "ఎలా వుందిరా అమ్మాయి? నచ్చిందా?" అంటే చట్టిముక్కు వుందనో, పిల్లికళ్ళున్నాయనో, లావుగా వుందనో, మరీ సన్నగా వుందనో, లేకపోతే నల్లగా వుందనో ఏవో వంకలు చెప్పేవాడు. కాకపోతే పందొమ్మిదిసార్లు వెళ్ళినచోటల్లా వాళ్ళు పెట్టిన టిఫినూ, కాఫీ పుచ్చుకునొచ్చేవాడు.

"వీడికీ జన్మలో పెళ్ళికాదు" అనేవారు వాళ్ళ స్నేహబృందం.

"ఒరేయ్! ఇంత మందిని చూశావు కదా, నీకు ఒక్కరూ నచ్చలేదా? ఒక పని చెయ్యకూడదూ? నీకు కావలసిన పిల్ల ఎలా వుండాలో ఒక బొమ్మ గీసి చూపించు. పేపర్లో ప్రకటిద్దాం ఆ ప్రకటనల కొచ్చిన సమాధానాన్ని చూసి, అప్పుడు ఏ పిల్లను చూడాలో నిశ్చయించుకోవచ్చు, ఏమంటావ్?" అన్నాడు వేణూ క్లాస్‌మేటూ, క్లోజ్ ఫ్రెండూ అయిన నరేష్.

"అదికాదుగానీ, అసలు నీకు కావలసినపిల్ల ఎలా వుండాలో చెప్పు. మేము రేపటినుంచే అటువంటి అమ్మాయికోసం అన్వేషణ ప్రారంభిస్తాం" అన్నాడు శ్రీధర్.

"చాలా అందంగా వుండాలి. ఆమెలో ఏ వంకా వెతికినా కనిపించకూడదు" అన్నాడు వేణు.

"తెల్లగా వుండాలి. భానుప్రియ లాంటి పెద్ద కళ్ళు, జయసుధ లాంటి మొహమూ, జయప్రద లాంటి ఫ్యూతీ, సుహాసినిలా నవ్వడం, సుమలత లాంటి ఫిగరూ, శ్రీదేవి లాంటి ముక్కూ ఇంకా"-ఏదో చెప్పబోతున్న వినోద్ మాటలకి అడ్డొచ్చి, "ఒరేయ్ ఆపరా! అయితే వీడి కీ జన్మలో పెళ్ళికాదు. అనవసరంగా పిల్లల్ని చూడొద్దు. మేమూ ఆ ప్రయత్నం మానుకుంటాం" అన్నారు మిత్రులు.

వేణూ నిట్టూర్చాడు. జాలిగా చూశాడు ఫ్రెండ్స్‌వంక, 'అంతేనంటారా?' అన్నట్టు.

"కాకపోతే ఏమిట్రా? పులిహోరలాగ పుల్లగా, బిరియానీలాగా ఘాటుగా, సాంబార్ సాలస్‌లాగా కమ్మగా అన్నీ కలిసినట్టుండే 'డిష్' తయారుచేసి తెమ్మంటే ఏం చేస్తాడు, ఆ వంటవాడు? నిన్ను చూసి పిచ్చివాడివనుకుని నవ్వు కుంటాడు. అట్టాంటిదేదీలేదు పొమ్మంటాడు. అమ్మాయి చూడగానే కళగా లక్షణంగా వుండాలి అని కోరుకుంటే అర్థం వుంది కాని ఇదేం తిక్క రుచిరా? పైగా నా దృష్టిలో ఈ రూపాల కన్నా గుణానికి ఎక్కువ ప్రాముఖ్యతనిస్తే బావుంటుంది. అమ్మాయి చదువూ, సంస్కారం ఇలాంటివి ముందుచూసి, ఆ తరవాత అందచందాల గురించి ఆలోచిస్తే బాగుంటుంది. అంతేకానీ, నువ్వు చెప్పిన ఆ హీరోయిన్ల మిక్చర్ సూపర్ హీరోయిన్‌లాంటి అమ్మాయి రూపం చూసి తృప్తిపడిపోతావా? అయితే సినీ నిర్మాతలు 'అందమైన అమ్మాయిలు కావలెను, మా రాబోయే చిత్రంలో నటించడానికి' అని ప్రకటించినట్టు 'అంద మైన అమ్మాయి కావలెను, నేను పెళ్ళి చేసుకోవడానికి' అనిచెప్పి నీకు కావలసిన పిల్ల ఎలా వుండాలో రాసి ప్రకటించు" అన్నాడు అందరిలోకీ కాస్త పెద్ద తరహాగా ప్రవర్తించే ప్రకాశ్.

వేణూ మొహం కోపంతో జేవురించింది. "ఒరేయ్! చదువులేకపోయినా ఫరవాలేదు. నాకు కాబోయే భార్య సంపాదించి నన్ను పోషించ నక్కరలేదు. సంస్కారం నేను చేసుకున్నాక నేనే నేర్పించుకోగలను. అంతేగానీ, ఒక కురూపిని కట్టుకుని రోజంతా ఆమె మొహం చూసి భరించలేనురా! డెఫినెట్‌గా నాకు అందమైన భార్యే కావాలి!" అన్నాడు ఖచ్చితంగా సీరియస్‌గా.

అతడి వింత ఆలోచనలకి ఆశ్చర్యబోయినా, మనకెందుకులే అని ఊరుకున్నారంతా.

వరసగా నాలుగు క్యాలెండర్లు మారాయి. బి.ఇ. పూర్తయిపోవడం వల్ల తలొకరూ తలొక ఊరికెళ్ళిపోయారు ఉద్యోగరీత్యా. చాలామందికి పెళ్ళిళ్ళయిపోయాయి. కొందరికి పిల్లలుకూడా పుట్టేశారు.

వేణూకి మాత్రం అతనికి నచ్చిన పిల్ల దొరకలేదు సరికదా, అసలు సంబంధాలే రావడం మానేశాయి.

"ఆc....అతడా? అతడికో తమాషా. ప్రతి పిల్లనీ చూడ్డం, నచ్చలేదని చెప్పడం" అన్న వార్త బాగా ప్రచారమైపోయింది.

వేణూకి దిగులు పట్టుకుంది, తనకింక పెళ్ళి కాదేమోనని!

తల్లో తెల్ల వెంట్రుకలు రావడం మొదలెట్టాయి. వయస్సుతోపాటు పెరిగే వొళ్ళు ముదిరిన బ్రహ్మచారికి ఆనవాలుగా నిలిచింది.

క్రమేణా అందరూ మరిచే పోయారు. వేణు పెళ్ళి గురించి మాట్లాడ్డం మానేశారు.

ఈ సంగతులు కొంతమట్టుకు ఆ వూళ్ళోనే వున్న వినోద్ అప్పుడప్పుడు ఉత్తరాల్లో రాసేవాడు. ఒకటి రెండు నిజంగా చాలా అందమైన పిల్లల సంబంధాలే వొచ్చాయనీ, వాళ్ళు పిణ్ణి చూసి "అసహ్యంగా వున్నాడు, మాకొద్దు" అంటూ వెళ్ళిపోయారనీ రాశాడు. ఆ తరవాత వినోద్‌కి కూడా ఆ వూరి నుంచి ట్రాన్స్‌ఫర్ అవడం వల్ల, మరి ఉత్తరాలు రాయలేదు. వేణు సంగతులేమీ తెలీలేదు నరేష్‌కి.

ఇంట్లో కాలు పెడుతూనే "మోహినీ....మోహినీ....రెండు కప్పులు కాఫీ పట్టుకురా, నా క్లాస్‌మేటూ క్లోజ్ ఫ్రెండూ నరేష్ వొచ్చాడు" అంటూ కూర్చోరా అని కుర్చీ చూపించాడు, టింకూని చంకలోనించి దింపుతూ.

"ఊc...." అంటూ లోపలినుంచి ఒచ్చిన సమాధానానికి తిరిగి చూశాడు నరేష్. ఆమె కనిపించలేదు.

నరేష్ ఆత్రుత పట్టలేకపోతున్నాడు.

ఓ అయిదు నిమిషాలయ్యాక ఆమె ట్రేలో రెండు కాఫీ కప్పులతో ప్రత్యక్షమయింది.

"నమస్కారమండీ!" అంటు లేచాడు నరేష్ బాగానే వుందని పించింది ఆమెని చూడగానే.

"అది మా పనిమనిషిరా!" అన్నాడు మెల్లగా వేణూ, "వుండు, ఆమెని పిలుచుకొస్తా" అని లోపలికెళుతూ.

నరేష్‌కి గుండె ఆగిపోయినట్టనిపించింది. "పనిమనిషే ఇంత బాగుంటే, ఆవిడెంత బాగుండాలీ! వీడి టేస్టు గొప్పదే! మొత్తానికి అనుకున్నది సాధించాడు" అనుకుంటూ కాఫీ తాగడం పూర్తిచేసి కప్పు టేబుల్ మీద పెడుతుండగా ఆమె వొచ్చింది వేణూ వెనకాలే నడుస్తూ.

నరేష్ గుండె ఆగిపోయినట్టయింది. నాలిక పిడచకట్టుకుపోయి, గొంతు తడారిపోయినట్టయింది. తన కళ్ళని తనే నమ్మలేక, కళ్ళు మరింత పెద్దవి చేసి చూశాడు. తారు నలుపురంగూ, ఎత్తుపళ్ళూ, చీపికళ్ళూ....

"నమస్కారం!" అన్నాడు ఎలాగో తేరుకుని.

ఆమె నిర్లక్ష్యంగా నమస్కారం పెట్టింది,

నరేశ్ మనస్సు చివుక్కుమంది. కాస్సేపు కూర్చుని లేచాడు, "వెళ్ళొస్తా"! అని.

వేణు కళ్ళలోని నీటిపొర చూసి ఆశ్చర్యంగా "ఏమిటిది, ఎందుకు?" అన్నాడు ఆప్యాయంగా భుజం నిమురుతూ.

"నిన్ను భోజనానికి కూడా పిలవలేని అసమర్థుణ్ణి. లక్ష రూపాయలకి ఆమెకి అమ్ముడుబోయిన బానిసని." కళ్ళుతుడుచుకున్నాడు వేణు.

నరేష్‌కి జాలేసింది. "విధి బలీయం" అన్నాడు.

"కాదు. ఇది నా మూర్ఖత్వం. ఎవరెన్ని చెప్పినా అర్థంలేని పిచ్చి ఊహలతో చేతికందిన అవకాశాలన్నింటినీ కాలదన్నుకున్నాను. జీవితంలో కొంత రాజీ పడడం అవసరమనీ, కొంత త్యాగం, కొంత నేర్పూ, కొంత ఓర్పూ అవసరమని గ్రహించలేకపోయాను. నాకింక పెళ్ళి కాదన్న దిగులుతో అమ్మ మంచంపడితే, ఏదో ఒక పిల్లనిచూసి కట్టెయ్యాలన్న నాన్నగారి పట్టుదలకీ, మోహినికి వరుడు దొరక్క వాళ్ళు విచారిస్తున్న సమయం కలిసొచ్చింది. దానికితోడు లక్ష రూపాయల కట్నం అందరి కళ్ళూ మూసేసింది! చావు బతుకుల్లో వున్న అమ్మచేత అక్షింతలు వేయించుకుని ఓ యింటివాణ్ణయ్యానన్న తృప్తితో ఆమె మరణించడానికి తోడ్పడ్డాను. 'కట్టుకున్నదానికి ఎప్పుడూ అన్యాయం చెయ్యను' అని అమ్మకిచ్చిన మాట నిలుపుకుంటూ కాలం గడుపుతున్నాను." దుఃఖంతో మాట్లాడలేకపోయాడు వేణు.

"పోనీ, ఈమె గుణవంతురాలేనా?"

"చూశావుగా! డబ్బుతో వొచ్చానని చచ్చేంత గర్వం. గడ్డిపోచ కన్నా హీనంగా తీసిపారేస్తుంది నన్ను. యేమన్నా అంటే 'నిన్ను లక్ష రూపాయలతో కొనుక్కున్నాను జాగ్రత్త' అని మాటలతో హింసిస్తుంది. ఒరేయ్! గొంతెమ్మ కోరికలకిపోయి, అర్థంలేని పిచ్చి కోరికలతో అమూల్యమైన జీవితపు విలువలు తెలుసుకోలేక, ఆనాడు అలా ప్రవర్తించాను. అందం, ఐశ్వర్యం అన్నీ తాత్కాలికమైనవే. వయస్సుతోపాటు అందం కూడా సడలిపోతుంది. ఆ తాత్కాలికమైన దానికోసం శాశ్వతమైన అనురాగం, ఆప్యాయతా, సంస్కారం అనే వాటికి దూరమైపోయాను. జీవితాన్ని గురించి సరైన అవగాహన లేక, నా బతుకుని నేనే చేతులారా సర్వనాశనం చేసుకున్నాను. కారుంది, అదిగో చూడు. అది ఆమెతో వెళ్ళినప్పుడే వాడాలి. డబ్బుంది. పైసా ముట్టుకోవడానికి వీల్లేదు. చచ్చేంత అసహ్యం, కోపం ముంచుకొస్తుంది. ఏమి చెయ్యడానికీ వీల్లేదు. అమ్మమాట నన్ను కర్రేస్తుంది. ఏంచెయ్యను చెప్పు?" కళ్ళనిండా నీళ్లు నింపుకున్న వేణుని భుజంతట్టి ఊరుకోబెట్టడం తప్ప ఏం చెయ్యాలో తెలీలేదు నరేష్‌కి.

ఆ రాత్రి అలకపాన్పు వేసిన సుమతికి జరిగిందంతా చెబితే, ఆమె నోరు తెరిచి "అలాగా! క్షమించండి. నేనపార్థం చేసుకున్నాను మిమ్మల్ని" అని అతని గుండెల మీద తలపెట్టి పడుకుంది పశ్చాత్తాపంతో. అతనిలో ఏకమైపోవాలన్న తపనతో గట్టిగా కౌగలించుకుంటున్న సుమతి కేసిచూసి తృప్తిగా నిట్టూర్చి "ఇంతకన్నా ఏం కావాలి?" అనుకుంటూ ఆ ఆప్యాయతకి పరవశించిపోతూ, ఆమె బాహువుల్లో నలిగిపోతూ, ఆమెను ముద్దుల్లో ముంచేస్తూ, టేబిల్ లైట్ బటన్ నొక్కి దీపాన్నార్పేశాడు నరేష్, 'సీకట్లో సూడాలి నీ కళ్ళ తళతళలు' అనే ఎంకి పాటని తలుచుకుని మరింత పులకరించిపోతూ.